## ఫెంగ్ షుయి



### రోజూ అగరొత్తులు వెలిగించండి

దాదాపు అన్ని మతాల వారూ అగరొత్తుల ధూపాన్ని శుభసూచకంగా భావిస్తారు. దీనికి ప్రత్యేక కారణం అగరొత్తుల వాసన బాగుండటం ఒకటయితే, భగవంతుని పూజించటం కోసం వాడటం రెండో కారణం. ధూపం వేయడం వలన అక్కడ ఉన్న ప్రతికూల శక్తులు నశిస్తాయి. దీంతో ఇంట్లోని మనుషులు చైతన్యవంతంగా, ఆరోగ్యంగా ఉంటారు.

చిన్నపిల్లలకు రోజూ స్నానం చేయించాక ధూపం వేస్తుంటారు. అలాగే అమ్మాయిలు తలంటు పోసుకున్నాక, జుట్టుకు ధూపం వేస్తుంటారు. ఈ ధూపం కంటికి కనిపించకుండా మనుషుల మీద ప్రభావం చూపే ప్రతికూల శక్తుల మీదే కాకుండా, చెడు చేసే సూక్ష్మక్రిముల పైన కూడా పోరాడుతుంది.

ఎప్పుడైనా దుర్గంధం పీల్చామంటే ఎలా ఉంటుంది? చాలా చీకాగ్గాఉంటుంది. అదే సుగంధాన్ని పీల్చామంటే ఉల్లాసంగా ఉంటుంది. ఉల్లాసంగా ఉన్నప్పుడు మన ఆలోచనా ధోరణిలో కూడా తప్పకుండా మార్పు ఉంటుంది. మన మెదడు కూడా చాలా చురుగ్గా పనిచేస్తుంది. దీంతో మనం తలపెట్టే పనుల్లో విజయం సాధిస్తాం. సరైన నిర్ణయాలు తీసుకుంటాం. మనిషిలో పాజిటివ్ ధోరణి కూడా పెరుగుతుంది. ఇవన్నీ కూడా మన పెద్దలు ఎప్పటినుంచో పాటిస్తున్నవే! పెద్దలు ఒక ఆచారాన్ని ఏర్పాటు చేసారంటే దాని వెనక ఎన్నో వందల ఏళ్ళ పరిశీలన ఉంటుంది. అలాగని పెద్దల ఆచారాలన్నీ గుడ్డిగా ఆచరించాలనికాదు. మనం తర్కంతో ఆలోచించినా ఆ ఆచారాల్లోని మంచీ చెడులు మనకు కూడా స్పష్టంగా తెలిసిపోతాయి. కాబట్టి, ఇంట్లో రోజూ పొద్దున పూట, సాయంత్రం పూటా అగరొత్తులు వెలిగించడం గాని, లేదా సాంబ్రాణి పొగ వేయడం గాని మరవకండి.

*

వారం వారం 'ఫెంగ్ షుయి' మీకోసం

## 'సరసి' కత

వైశంపాయనుడికి చిన్నప్పటినుంచీ సమయం విలువ బాగా తెలుసు. ఎప్పుడైనా ఖాళీ సమయం దొరికితే నిద్రయినా పోతాడు గాని వేస్టు మాత్రం చేసేవాడు కాదు.

ఆ రోజు ఎన్టీవోడి సినిమా రిలీజైంది. ఫస్టుడే ఫస్టు ఆట అవుతోంది. మధ్యలో ఇంటర్వెల్ ఇచ్చి లైట్లేశారు. అందరూ లేచి వొళ్లు విరుచుకుని బైటకు పోయారు.



### బుద్ధిమంతుడు

హాలు ఓలు మొత్తంలో ఒకే ఒక మనిషి కుర్చీ లోంచి లేవకుండా కూర్చున్నాడు. కూర్చోడమే కాదు వెలిగిన లైట్ల వెలుగులో పుస్తకం తీసి చదువుకుంటున్నాడు.

బైటకు వెళ్లి లోపల కొచ్చిన ఒకతను అడిగేడు. ''ఎవరు బాబూ నువ్వు? ఏంటి చదువుతున్నావ్?'' అని.

''నా పేరు వైశంపాయనుడండి. రేపట్నించి పబ్లిక్ పరీక్షలు! టైము వేస్టు చెయ్యడం ఎందుకని!'' అని సమాధానం వచ్చింది.

*

కవిత

### ఆశతో...

ఒక జ్ఞాపకం ఆనంద భాష్పం
మరో జ్ఞాపకం చిరుహాసమే కదా
నువ్వు నా ఊహ
అంతేకాదు నేస్తం – ఊపిరి కూడా
చీకటిలో సైతము
నీ అడుగు జాడల వెంబడి
పరుగు లిడుతున్నా –
ఎక్కడో ఓ చోట
వెలుగు నవ్వులు రువ్వుతూ
నా కొరకు వేచి ఉంటావనీ...




–సూర్యశ్రీ